# హాలీడే హైరానా

**అదేదో అతిపెద్ద పురాతన భవనం. సత్రమని నేననుకుంటున్నాను. మేం అందులోకి దిగాం. మా పరివారమంతా ఎటువెళ్ళారో నేనొక్కదాన్నే ఆ పెద్ద హాల్లో నలువైపులా కలయజూస్తూ. యథాలాపంగా తల పైకెత్తాను. అక్కడో వెంటిలేటర్. అందులో ఓ చిత్రమైన ఆకారం. వాడేమిటో నాకేసి సూటిగా చూస్తూ బోసినోటితో నవ్వుతున్నాడు. తమాషాగా నెరిసిన గడ్డం. తలపై టోపీ. అతి చిన్న సైజులో కళ్ళు, ముక్కు, మొహం అదేం మనిషి? ఒక్క క్షణం ఒళ్ళు జలదరించింది. అంతలోనే భయం. గట్టిగా అరిచాను. అహ! అరిచాననుకున్నాను.**

ఇంతలో 'చిప్‌చిప్‌చిప్' బెల్ మోగింది. ఉలికిపాటుతో మెలకువ. అంటే... ఇప్పటిదాకా ఆ సత్రం... విచిత్ర మానవుడు కలల ప్రపంచమా! కనీసం కలలైనా సంతోషపెట్టేవి రావచ్చుగా. ఉహు! అవీ నా మనసల్లే గజిబిజిగా భయ పెడుతూ.

సర్లే... లేచి పాల ప్యాకెట్ తెచ్చుకోకపోతే ఏ పిల్లో, కుక్కో, మరొకరో హాంపర్. బాప్‌రే! నా టీ ఏంకాను? ఒక్క ఉదుటున లేచివెళ్ళి పాలప్యాకెట్ తెచ్చుకున్నాను. అవును, ఎన్నాళ్ళకు నేనొక్కదాన్నే ఇంట్లో ఉన్నాను... ఇవాళంతా నాదే కాలం. నాదే రాజ్యం. ఎవరి గొడవా నాకుండదు. నా హబ్బీ, పిల్లలు మొదటిసారిగా నన్నొదిలి ఊరెళ్ళారు. లేకపోతే ఈపాటికి నన్నింత స్థిమితంగా ఉండనిస్తారా? టీవద్దు, కాఫీ కలపరాదూ. ఉప్మా బోర్, చపాతీ చెయ్, నోనో... దోశె చెయ్! నా షర్టేది? వాటెబౌట్ మైటవెల్? మమ్మీ చుడీదార్‌కు నాడా ఎక్కించవా ప్లీజ్... ఇలా ఒకదానివెంట ఒకటి. విసుక్కుంటే నా హబ్బీ కొంటెగా 'సర్దుకుపోదాంరండి' సినిమా యాడ్ చూపించటం గుర్తొచ్చి నవ్వొచ్చింది.

ఇలా రివైండ్ చేసుకుంటే పోతే కష్టం. నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ బ్రష్ చేసుకుని 'టీ' కలుపుకున్నాను. అదృష్టవశాత్తూ పేపర్‌బాయ్ సమయానికే పేపర్ వేశాడు.

టీ తాగుతూ పేపర్ చూస్తూ కూర్చున్నాను.

'అడుగులేస్తున్న అటల్‌జీ'

హెడ్డింగ్ పెట్టిన జర్నలిస్ట్ చతురతకి నవ్వుకోకుండా ఉండలేకపోయాను. ఇంకానయం ఆంధ్ర బిజెపివారు అరిసెల పంపకం చేయలేదు అనుకున్నాను.

ముఖ్యమంత్రి విదేశీ పర్యటన, మంత్రులంతా పరేషాన్ ఆచూకీ దొరకని 'సాకీ' హంతకులు.

సినిమా పేజీ తిప్పాను. సినిమాపేరు అష్టా-చెమ్మా. ఏంక్రియేటివిటీరా బాబూ! నలుగురబ్బాయిలు, ఎనిమిది మంది అమ్మాయిలు, లవ్ సింబల్స్...


ఇంకో సినిమా 'మనసేవెన్న'- హీరో చేతిలో నిలువెత్తు కత్తి. భేష్! మరోటి సస్పెన్స్ థ్రిల్లర్ అట. 'చీకట్లో చిటికెన వేలు'. మళ్ళీ నాకు నా కల్లోని విచిత్ర మానవుడు గుర్తుకొచ్చాడు. వెంటిలేటర్‌లో వింతమానవుడు, ఆహా! ఈ టైటిల్ సినిమా వాళ్ళకు తెలిస్తే వెంటనే రిజిష్టర్ చేసుకుంటారేమో. ఆపక్క మరో సినిమా 'సైబర్‌కేఫ్ సయ్యాట.' సిస్టమ్ ముందు కూర్చున్న అమ్మాయి, అబ్బాయి. బాగు! బాగు! ఇంకాసేపుంటే బుర్ర ఖరాబయేట్లుంది.

అసలు నాకు బోలెడన్ని పనులున్నాయి. నా బుక్ షెల్ఫ్‌ను సర్దుకోవటం, మిత్రులకు లేఖలు రాయుట. కరువుతీరా పగటినిద్ర. ఇష్టమైన పాటలు వినుట... ఇంకా చాలా అనుకున్నా- సరే.

ఇంకో కప్పు టీ తాగాను. ముందుగా బుక్‌షెల్ఫ్‌లో అడ్డదిడ్డంగా పడివున్న నా పుస్తకాలు, కాగితాలన్నిటినీ తీసి కింద పెట్టాను. అంతలో ఈల విన్పించింది. చెత్తవాడు. బాబోయ్ వాడిని మిస్ అయితే ఇంక ఇంతేసంగతులు. నాలుగురోజులుగా రావట్లేదు. రెగ్యులర్‌గా రావడమంటే రోజు విడిచి రోజు వస్తాడు. లోడ్ ఎక్కువయితే ఈల వేయకుండా వెళ్ళిపోతాడు. నేను పరుగెత్తుకెళ్ళి

జె. శ్యామల

చెత్త కవర్‌ను వాకిట్లో పెట్టాను. వీధిలో అందరూ అదే పనిచేస్తున్నారు. పూర్వం కృష్ణుడి వేణువువింటే, గోపికలు పరుగెత్తుకొచ్చేవాళ్ళట. ఇప్పుడు ఈ చెత్తబ్బాయి ఈలవింటే ఇల్లాళ్ళు చెత్తలతో పరుగెత్తుకొస్తున్నారు. ఆగకుండా ఈ ఆలోచన్లొకటి.



హమ్మయ్య! చెత్తబ్బాయి చెత్తను పట్టుకెళ్ళాడు. మళ్ళీ పుస్తకాల దగ్గరకు వచ్చాను. ఇష్టమైన ఉత్తరాలు, ముఖ్యమైన కటింగ్స్. వాటి గురించిన ఫ్లాష్ బ్యాక్‌లు...

'చిప్‌చిప్‌చిప్' బెల్.

'ఎవరబ్బా!' తలుపు తీస్తే గేటు దగ్గరో మనిషి 'కొబ్బరిచెట్లకు ఇంజెక్షన్ ఇస్తానండీ' అన్నాడు.

'అవసరంలేదు' అంటూ వెనక్కు వచ్చాను.

పుస్తకాలమీద దుమ్ము దులపటం మొదలెట్టాను.

ఫోన్‌రింగ్.

'అబ్బా!' అనుకుంటూ ఎత్తితే 'వరహావతారంగారున్నారా?'

వళ్ళు మండింది. 'ఇక్కడ అలాటి అవతారాలెవరూ లేరు'

'అరే! అసలు మీది ఏ ఏరియా అండీ?'

'గాజుసిటీ' కసిగా ఫోన్ పెట్టేశాను.

షెల్ఫ్‌లో అడుగున ఉన్న పాత పేపర్లు తీసి శుభ్రం చేద్దామని బ్రష్ అందుకున్నానో లేదో మళ్ళీ 'చిప్‌చిప్ చిప్'

'ఎక్స్‌క్యూజ్‌మీ మేడమ్. మేం రిచ్‌లుక్ కంపెనీ నుంచి వచ్చామండీ' మొదలెట్టాడు.

"ఇప్పుడు మాకేం అవసరంలేదండీ" కట్ చేశాను.

"జస్ట్ వూరికే చూడండి మేడమ్. మా కంపెనీ కొత్తగా వెట్‌ఫ్రీ మెటీరియల్‌ను మార్కెట్లోకి తెచ్చింది. వర్షంలో తడిసినా డ్రెస్ మాత్రం తడవదు. ఏ రెయిన్‌కోట్లు, జెర్కిన్లు వేసుకునే అవసరం ఉండదు. చిన్నగ్లాసులో నీళ్ళు తెండి మేడమ్..." అడిగాడు.

వీడి గొడవేమిటి? నమ్మవచ్చా? సందిగ్ధంలోపడి ఎందుకైనా మంచిదని 'అంట్లు తోమడం అయిందా చంద్రమ్మా' అని ఒక డైలాగ్ గట్టిగా అంటూ (ఇంకో మనిషి ఉన్న ఇంప్రెషన్ తెప్పించి) నీళ్ళు పట్టుకెళ్ళాను.

"థాంక్యూ మేడమ్" అంటూ నీళ్ళు కొద్దిగా చిలకరించి, రుద్దేసి 'చూడండి మేడమ్ ఎలా పొడిగా ఉందో' అన్నీ ప్లజంట్ కలర్సే. సార్‌కు తీసుకోండి మేడమ్' అస్త్రం సంధించాడు.

'ఇప్పుడు డబ్బుల్లేవు వద్దులెండి' చెప్పాను.

'ఫర్లేదు మేడమ్. చెక్ ఇచ్చినా తీసుకుంటాం' అన్నాడు.

'అసాధ్యుడు' మనసులోనే అనుకొని 'కార్డ్ ఇచ్చి వెళ్ళండి మేమే విజిట్ చేస్తాం' చెప్పాను.

ఓ.కే. మేడమ్. నిరాశను దాచుకుంటూ కార్డ్ ఇచ్చి వెళ్ళాడు.

హమ్మయ్య వదిలాడు. మళ్ళీ లోపలికి వచ్చాను. నీరసంగా అనిపించింది. రెండు అరటిపళ్ళు అందుకున్నాను. తినేసి పుస్తకాలవైపు వెళ్ళానోలేదో ఫోన్ రింగయింది.

తీరా అందుకుంటే 'బాబీ! మై నాగపూర్‌సే బిట్టూ బోల్ రహాహూ' అన్నదో గొంతు.

'రాంగ్ నంబర్' విసుగ్గా పెట్టేయబోయాను.

'ఏక్‌మినిట్. ఆప్‌కా నంబర్' అడిగాడు.

'అభీతో నంబర్‌లగాయేనా!? ఫిర్ హమ్‌సే క్యా పూచ్ రహేహో? తుమే హమారీ నంబర్‌సే క్యా మతలబ్?' అని కోపంగా ఫోన్ పెట్టేశాను. విసుగొచ్చేసింది. ఏమిటిది? ఏమనుకున్నాను, ఏం జరుగుతోంది. మళ్ళీ 'చిప్‌చిప్

చిప్.'

'ఎవరూ' అరుస్తూ వెళ్ళాను. నా గొంతు అంత రఫ్‌గా పలుకుతుందా అని నాకే ఆశ్చర్యం వేసింది.

'అమ్మా! కొంచెం మంచినీళ్ళు ఇయ్యరా. రోడ్డేస్తున్నాం' చేతిలో సొట్ట బడ్డ కోకోకోలా బాటిల్. ఆమె వెనుకే మరో ముగ్గురు.

'ఎండలో పనికదూ పాపం' అనుకుంటూ నీళ్ళు తీసుకెళ్ళాను. ఒకరి వెనుక ఒకరు తాగుతున్నారు. అందరూ తాగి, ఆ బాటిల్ నింపుకుని వెళ్ళేలోపు నేను ఇంట్లోకి, వాకిట్లోకి నాలుగుసార్లు తిరిగానేమో విసుగొచ్చేసింది.

అసలీ బెల్ ఆఫ్ చేసేస్తే సరిపోతుందేమో అనుకున్నా. కానీ కొరియర్‌లో తనకేదో లెటర్ వస్తుందని హబ్బీ చెప్పిన విషయం గుర్తొచ్చింది. ప్రాణానికి సుఖం లేదు.

స్నానం చేస్తే కొంచెం ఫ్రెష్‌గా ఉంటుందనిపించి అందుకుపక్రమించాను. డోర్‌బెల్ మోగుతుందేమోనన్న భయంతో హడావిడిగా కానిచ్చా. హమ్మయ్యా...

అద్దంలోకి చూస్తూ స్టిక్కర్ పెట్టుకుంటున్నా. మళ్ళీ చిప్‌చిప్‌చిప్ ఉస్సురంటూ వెళ్ళి కలుపు తీస్తే ముష్టివాడు. ఓ ఇత్తడి ప్లేటుమీద ఠంగ్, ఠంగ్‌మని కొట్టి 'శ్రీమన్నారాయణ, సూర్యనారాయణ' అంటూ

'ఏంలేదు వెళ్ళండి. ఎన్నో పనుల్లో ఉంటాం బెల్ ఎందుక్కొడతారు' విసుక్కున్నాను.

'ఎన్ని బెల్లులు కొడితే ఏంలాభం తల్లీ' వాడంతకన్నా విసుగ్గా చూసి వెళ్ళాడు.

అడుక్కోవటానికి వచ్చి డిస్టర్బ్ చేసింది కాక విసుగు చూపొకటి. అసలీ చూపులే చిత్రం. చూపు గురించి ప్రశ్నించలేం. తిట్టలేం. కళ్ళతో అసహ్యించుకోవచ్చు, తిట్టొచ్చు, కొట్టొచ్చు, చంపొచ్చు.

మళ్ళీ ట్రాక్ తప్పుతోన్న ఆలోచనను కంట్రోల్ చేసుకున్నా. మళ్ళీ పుస్తకాల దగ్గరకొచ్చా. ఆవులిచ్చిన పుస్తకాలు, లేఖలు, నేను నా ఆలోచన్లను రఫ్‌గా రాసి పడేసిన కాగితాలు... ఆ దొంతర్లను స్పృశిస్తుంటే మనసు జ్ఞాపకాల దొంతరల్లోకి వెళ్ళిపోతోంది.

అవునూ... పుస్తకాలు సర్దుట, పాటలు వినుట ఏకకాలంలో చేస్తే టైమ్ కలిసొస్తుంది కదా. చటుక్కున లేచా. తీరాచూస్తే ఆలోచనల్లో ఉండి గమనించలేదుగానీ విద్యుత్‌కోత అని తెలిసి నిరాశపడ్డాను. ఆ, పోన్లే మన 'ఎవరెడీ' ఉందిగా అనుకొని ఉత్సాహంగా వేసి చూశాను. ఆ బ్యాటరీలు డౌన్ అయి ఉన్నాయి.

'ఎన్నాళ్ళుగానో అనుకున్న పనులు ఈ వారం పూర్తవుతాయి. ఉల్లాసంగా గడుపుతారు' అన్న వారఫలం స్మృతిపథంలో మెరిసి, వెక్కిరించింది. అయినా అదంతా ట్రాష్ అనుకుంటూనే మళ్ళీ కాస్తంత నమ్మడం, నిరాశపడటం... అదే మనిషి బలహీనత. మరోరకంగా ఆశాపూరిత ధోరణి కావచ్చు.

ఇంతలో వాకిట్లో ఆటోఆగినచప్పుడు. ఆ వెనుకే బెల్ మోత. నా పరుగు.

ఎదురుగా ఎప్పుడోగాని రాని బంధువులు. 'రండి, రండి' సాదరంగా ఆహ్వానించాను.

లోపలికొచ్చారు. 'అబ్బ. ఎండ మండిపోతోంది' అన్నది మా అరుంధతి అత్తయ్య. గబగబా చల్లనీళ్ళు అందించాను. వాళ్ళ కోడలు నలువైపులా చూస్తూ గదిలోకి చూపు సారించి 'అవన్నీ పుస్తకాలే... అదేమిటి గుట్టలా' అంది విస్మయంగా.

'ఆ సర్దుదామని తీశా! అన్చెప్పి 'ఒక్క క్షణం అంటూ చేతికొచ్చినట్లు పుస్తకాలన్నిటినీ పక్కనున్న అట్టపెట్టెలో పడేశా.

మళ్ళీ ఇవతలకొచ్చి 'చెప్పండి అత్తయ్యా! ఎప్పుడొచ్చారీ వూరు?'

'ఆ నీకు తెలీదేమోగానీ మా అక్క మనమడు హరిశ్చంద్రుడని ఉన్నాళ్ళే. వాడి పెళ్ళికొచ్చాం. ఎక్కడో దిల్‌షుక్‌నగర్‌లో. రాత్రి పెళ్ళయిపోయింది. ఇంతదూరం వచ్చాంకదా, మిమ్మల్ని కూడా చూసివెళ్దామని...' అంది.

'అలాగా' అన్నాను.

మాటల్లో పిల్లలూ, వాళ్ళనాన్న ఊరెళ్ళారని తెలిసి 'రేపొస్తారా.. సరే ఒక్కరోజేగా తేడా చూసే వెళతాం.' అందత్తయ్య.

అత్తయ్య బంధుప్రేమకు ఆనందమయింది.

అయితే నా ప్రోగ్రామ్ అంతా తల్లకిందులయినందుకు నిరాశ.

కడుపులో ఆకలి మొదలయింది. ఇంక అన్నమేమిటి? టిఫిన్ చేస్తే సరి అనుకొని వాళ్ళ కబుర్లు వింటూ టిఫిన్ చేశా.

మళ్ళీ రాత్రి భోజనాలు వగైరా.

ఇంటిని ఎలా నీట్‌గా ఉంచుకోవాలో, అన్నీ ప్లానింగ్ ప్రకారం ఎలా చేసుకోవాలో వాళ్ళ కోడలు ఆ రాత్రంతా నాకు చెబుతూనే ఉంది.

సెలవులు దొరకని ఉద్యోగం. దొరికిన కాస్త వెసులుబాటులో ఏవో ఒక అవాంతరాలు... ఎవరికి తెలుస్తయ్.

'రాత్రే కూరలు తరిగి పెట్టుకుంటే మర్నాడు హడావిడి పడక్కర్లేదు' అంటోందామె.

'నాకంత ఓపికలేదు. చచ్చీచెడి ఇంటికొచ్చి ఆపూట తిండి ఏర్పాట్లతోనే హైరానాపడుతుంటే ఇంక మర్నాటి గురించి కూడా. రోజంతా అలిసిపోయి రాత్రి పదింటివేళ బీన్స్ తరగటం, గోంగూర వలవడం నావల్లకాదు' తెగేసి చెప్పాను.

ఆమె ముఖం గంటుపెట్టుకుంది.

అట్టపెట్టెలో కుక్కిన పుస్తకాలు, క్యాసెట్స్ రేక్‌లో స్తబ్దుగా ఉన్న కేసెట్లు. రాద్దామన్న లేఖలు నీటిమీద రాతలుగా హాలీడే... 'జాలీడే... నిరాశ, నిద్రాదేవిని కూడా దూరం చేస్తుంటే... ఆలోచనలను కంట్రోల్ చేసే రిమోట్ దొరక్క అతలాకుతలమవుతూంటే ఎదురుగా క్యాలెండర్ కనిపించి 'ఉందిలే మంచీ కాలం ముందూ ముందునా' అన్నట్లు మళ్ళీ ఆశను చిగురింపజేసింది.

## అతిగా టీ తాగడం అనర్థదాయకం



టీలు, కాఫీలు అతిగా తాగడం మంచిది కాదు. కొందరు రోజుకు కనీసం పదిసార్లు అయినా టీలు తాగకుండా ఉండలేరు. మరికొందరు పొద్దున్నే లేవగానే టీనో, కాఫీనో తాగకుండా ఏ పనీ చేయలేరు. సాయంత్రం పూట మళ్ళీ టీ, కాఫీలు సేవించాల్సిందే. మండుటెండల్లో కూడా వీరి ఈ అలవాట్లలో మార్పు ఉండదు. టీ తాగడానికి, కాఫీ తాగడానికి అంతగా అలవాటు పడివుండటమే దీనికి కారణం. అయితే రోజుకు రెండు మూడు సార్లు తాగడం వల్ల నష్టం లేదు. కానీ టీలు తాగడం మీదనే ఎక్కువగా గడిపితే ఆరోగ్యం దెబ్బ తినడం ఖాయం. ఆకలి వేసినప్పుడు ఏమైనా తినకుండా వీటిని తాగుతూ కాలక్షేపం చేస్తారు. ఇది దైనందిన వ్యవహారమైతే కొన్నాళ్ళకు ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయి. కనుక ఇలాంటి అలవాట్లను మానుకోవడం మంచిది. చాలామంది ఇంటికి వచ్చినవారికి టీ ఇవ్వడం కనీస మర్యాద అనుకుంటూ మధ్యాహ్నమైనా, రాత్రయినా టీనో, కాఫీనో చేసి పోస్తుంటారు. కాని వేళకాని వేళల్లో తాగడం, ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవడం అవసరమా? ఆలోచించండి.

